బీటలు వారి.. పెచ్చులూడి


పెచ్చులూడి, బీటలువారిన నగరపాలక సంస్థ కార్యాలయం

- శిథిలావస్థలో శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం
- సీలింగ్ పరిస్థితీ అంతే
- బిక్కుబిక్కుమంటూ అధికారులు, సిబ్బంది విధులు

శ్రీకాకుళం అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయంలో ఏ గది చూసినా గోడలు బీటలు వారి, శ్లాబులు పెచ్చులూడి దర్శనమిస్తున్నాయి. ఎప్పుడు ఏ క్షణాన ఆ పెచ్చులూడి తమపై పడతాయోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. 1856లో మునిసిపాలిటీగా ఏర్పడిన శ్రీకాకుళం.. 2015 డిసెంబర్ 9న నగరపాలక సంస్థగా అభివృద్ధి చెందింది. సుమారు 169 ఏళ్ల చరిత్ర కలిగిన కార్పొరేషన్ భవనానికి అధికారులు పలుమార్లు మరమ్మతులు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. అయినప్పటికీ నిర్మాణ పనుల్లో లోపాలతో గోడలు బీటలు వారుతున్నాయి. కార్యాలయంలోని రికార్డు రూమ్‌లో శ్లాబ్ పెచ్చులూడాయి. మేనేజర్ రూమ్ గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. సమావేశ మందిరంలో ఇటీవల వేసిన సీలింగ్‌కి కన్నాలు పడగా.. ఎప్పుడు పడిపోతుందో తెలియని దుస్థితి నెలకొంది. కార్యాలయం బయట పై అంతస్తు గోడకు పెచ్చులూడిపోగా, పిచ్చి మొక్కలు మొలిశాయి. మార్చి 31 నాటికి రూ.26 కోట్ల పన్ను బకాయిలు వసూలు చేసిన కార్పొరేషన్ అధికారులు.. ఈ కార్యాలయం మరమ్మతులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


మేనేజర్ రూమ్‌లో సీలింగ్ ఇలా..


సమావేశ మందిరం ముందు ప్రాంగణంలో శ్లాబ్, సీలింగ్ దుస్థితి


పెచ్చులూడిన శ్లాబ్ కింద బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న రికార్డు రూమ్ సిబ్బంది

ప్రతిపాదనలు పంపాం

శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే. ప్రైవేట్ పార్టనర్ షిప్ (పి.పి.పి) విధానంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. కింద భవనంలో కమర్షియల్ కాంప్లెక్స్, మీద భవనంలో నగరపాలక కార్యాలయం నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నిర్మాణ పనులు చేపడతాం. కార్యాలయంలో బీటలు బారిన శ్లాబ్‌కు మరమ్మత్తులు చేయిస్తాం.

-పీవీవీ ప్రసాదరావు, నగర పాలక సంస్థ కమిషనర్, శ్రీకాకుళం

పదివేలు కాదు.. ఇరవై వేలిస్తేనే..!

- రీపోస్టింగ్ ఆర్డర్ ఇచ్చేందుకు డబ్బుల డిమాండ్
- మహిళా ఉద్యోగి నుంచి లంచం
- ఏసీబీకి పట్టుబడిన డీఎంహెచ్‌వో, సీసీ


ఏసీబీకి చిక్కిన డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ, సీసీ సురేష్

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఓ మహిళా ఉద్యోగికి రీ పోస్టింగ్ ఆర్డర్‌కాపీ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేస్తూ.. జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో), క్యాంప్ క్లర్క్ (సీసీ) గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వైద్యఆరోగ్యశాఖలో కలకలం రేపిన ఈ ఘటనకు సంబంధించి ఏసీ బీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సీనియర్ సహాయకురాలిగా పనిచేసిన దివ్యాంగురాలు ఆదివరపు కాంతమ్మ గతేడాది అక్టోబరు 2న మెడికల్ లీవ్ పెట్టింది. ఆ తర్వాత ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైంది. అనంతరం రీపోస్టింగ్ కోసం ఆర్జేడీని సంప్రదించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 25న ఆమెకు రీ పోస్టింగ్ ఇవ్వాలంటూ శ్రీకాకుళం డీఎంహెచ్‌వోకు ఆర్జేడీ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో కాంతమ్మ రీ పోస్టింగ్ కోసం డీఎంహెచ్‌వో డాక్టర్ టీవీ బాలమురళీకృష్ణను ఆశ్రయించింది. ఆయన ఆ ఆర్డర్ కాపీ ఇచ్చేందుకు రూ.20వేలు లంచం డిమాండ్ చేశారు. కాగా.. తన వద్ద డబ్బులు లేవని, రూ.10వేలు ఇస్తానని ఆమె చెప్పినా వినలేదు. డబ్బులిస్తేనే.. రీపోస్టింగ్ ఆర్డర్ ఇస్తానంటూ డీఎంహెచ్‌వో తేల్చిచెప్పారు. దీంతో ఆమె ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. రీపోస్టింగ్ ఆర్డర్ ఇచ్చేందుకు డీఎంహెచ్‌వో లంచం డిమాండ్ చేస్తున్నారంటూ ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వోను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు ఏసీబీ అధికారులు పథకం రచించారు. ఇందులో భాగంగా గురువారం కాంతమ్మకు రసాయనం పూసిన రూ.20వేలను అందజేశారు. కాంతమ్మ ఆ డబ్బులను తీసుకెళ్లి.. డీఎంహెచ్‌వోకు వెళ్లి అందజేసింది. డీఎంహెచ్‌వో పక్కనే ఉన్న క్యాంప్‌క్లర్క్ వాన సురేష్‌కు ఆ డబ్బులను ఇవ్వగా... వాటిని లెక్కించాడు. రూ.20వేలు సరిగానే ఉన్నాయని చెప్పాడు. అదే సమయంలో అక్కడ మాటు వేసిన ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి, సిబ్బంది దాడి చేసి డీఎంహెచ్‌వో, సీసీని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి విశాఖపట్నం ఏసీబీ కోర్టుకు తరలించామని ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి తెలిపారు.


మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

నిప్పు.. అడవులకు ముప్పు


చినరంగుమరియా వద్ద అగ్నికి ఆహుతవుతున్న అటవీ ప్రాంతం (ఫైల్)

- మార్చి 31న మందస మండలం చీపి సమీపంలో హొన్నాళి వద్ద రగిలిన మంటలు ఇవి. సుమారు ఐదు ఎకరాల్లో రైతులకు చెందిన జీడి, మామిడితోపాటు అటవీశాఖకు చెందిన అనేక ఎకరాల్లో టేకు, వెదురు వనాలు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలు వ్యాపించకుండా అదుపు చేయడంతో కొంతమేర నష్టం తగ్గింది. పంట చేతికొచ్చే దశలో జీడి, మామిడి చెట్లు కాలిబూడిదయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- మందస మండలం కళింగదల్ సమీపంలోని తూర్పుకనుముల్లో గతేడాది అగ్నిప్రమాదానికి గురైన కొండ ఇది. విలువైన చెట్లు, దట్టంగా ఉండే వెదురు వనాలు అగ్నికి ఆహుతై ఇలా మోడుబారిపోయింది. వన్యప్రాణులకు నెలవైన ఈ ప్రాంతం ఎడారిలా మారింది.



- మెళియాపుట్టి మండలం రింపి గ్రామానికి చెందిన డి.బింజయ్య అనే గిరిజనుడు గత ఐదేళ్లుగా సుమారు 8 ఎకరాల్లో జీడి, మామిడి చెట్లు పెంచుతున్నాడు. గతేడాది అగ్నిప్రమాదం వద్ద సుమారు 5 ఎకరాలు కాలిపోవడంతో ఆందోళన చెందాడు. కొంతమంది అడవుల్లో నిప్పు పెట్టడంతో తమకు పంట నష్టం వాటిల్లిందని వాపోతున్నాడు.
- మెళియాపుట్టి మండలంలోని అడ్డివాడ, చందనగిరి, గూడ కొండల్లో గతేడాది నిప్పు అంటుకుంది. సుమారు వారం రోజులపాటు మంటలు అదుపుకాలేదు. దీంతో దాదాపు 8 ఎకరాల్లో చెట్లు కాలిపోయి.. కొండల్లో పచ్చదనం కనుమరుగైందని గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

- ఆకతాయి చర్యలతో అనర్థాలెన్నో..!
- ఏటా వేసవిలో అధికంగా అగ్నిప్రమాదాలు
- రూపం కోల్పోతున్న మహేంద్రగిరులు
- జనావాసాల్లోకి వన్యప్రాణులు

హరిపురం/ మెళియాపుట్టి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):

ఎత్తయిన వృక్షాలు, గలగల పారే సెలయేళ్లు.. పచ్చక బయళ్లు.. వన్యప్రాణుల సంచారంతో ప్రకృతి రమణీయతకు ప్రతీకగా నిలిచే అడవులు క్రమేపీ కనుమరుగవుతున్నాయి. మహేంద్రగిరులు.. జీవ వైవిధ్యానికి పుట్టినిల్లు. ప్రకృతి సంపదకు నెలవు. పులులు, ఏనుగులు వంటి తదితర జంతువులు ఇక్కడ నిత్యం సంచరిస్తుంటాయి. ఇంతటి అభయారణ్యానికి అగ్ని ప్రమాదాల ముప్పు పొంచి ఉంది. ఏటా జనవరి నుంచి ఏప్రిల్ వరకు తరచూ అగ్నికీలలు ఎగిసి పడుతుంటాయి. దీంతో అటవీ సంపద బుగ్గిపాలు కావడంతో పాటు వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. పర్యావరణానికి ముప్పు తలెత్తుతోంది.

ఏటా వేసవి ఆరంభంలోనే కొండలు, గుట్టలపై ఉండే చిట్టడవులతోపాటు గడ్డి మైదానాలు ఎండిపోతాయి. వాటికి కొంత మంది ఆకతాయిలు నిప్పు పెట్టడంతో విలువైన వృక్షాలతోపాటు జీడి, మామిడి తోటలు, పంట పొలాలు అగ్నికి ఆహుతవుతున్నాయి. అగ్ని ప్రమాదాలతోపాటు గొడ్డలి వేటు.. అడవులకు ముప్పు తెచ్చిపెడుతున్నాయి. జిల్లాలోని 5.8లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. దీనిలో తూర్పుకనుములుగా పేరొందిన మందస, సోంపేట, పలాస, మెళియాపుట్టి మండలాల పరిధిలో విస్తరించిన మహేంద్రగిరులు అగ్నికి ఆహుతై రూపం కోల్పోతున్నాయి. ఆయా మండలాల పరిధిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నాటిన విలువైన టేకు, మామిడి, నీలగిరి, నేరడు వంటి చెట్లతోపాటు వేలాది ఎకరాల్లో వెదురు వనాలు విస్తరించి ఉన్నాయి. డ్వామా, ఉపాధిహామీ పథకంలో అధికారులు కొండలు, గుట్టలపై టేకు, ఏగిసు, ఉసిరి, ఎర్రచందనం వంటి మొక్కలను రూ.లక్షలు వెచ్చించి నాటి పెంచారు. కాగా, ఆకతాయిల చర్యలు.. విలువైన చెట్లను బూడిద చేస్తున్నాయి. అడవులకు సమీపంలో రైతులు సాగు చేస్తున్న జీడి, మామిడి, చెరకు, తెట్టంగి వంటి అరుతడి పంటలకు మంటలు వ్యాపిస్తున్నాయి. చెట్లు ఆకురాల్చిన కాలంలోనే ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. పశువులు పెంపకందారులు, వ్యవసాయ పనులు, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం అడవులకు వెళ్లేవారు కొంతమంది చుట్ట, సిగరెట్టు వంటివి కాల్చి.. వాటిని ఆర్పకుండా నిర్లక్ష్యంగా పడేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అవి ఎండిన ఆకులపై పడి మంటలు రాజుకుంటున్నాయి. కొంతమంది పోడు వ్యవసాయం కోసం పచ్చని చెట్లకు నిప్పుపెడుతున్నారు. మరి కొంతమంది తేనె సేకరణ కోసం చెట్లకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి అడవులకు ముప్పు వాటిల్లుతోంది. రోజురోజుకూ పచ్చదనం తగ్గుతోంది. అలాగే అడవుల్లో గ్రానైట్‌తోపాటు మైనింగ్‌కు లీజులు ఇవ్వడంతో అటవీ విస్తీర్ణం తగ్గిపోతోంది. ఫలితంగా ప్రకృతి విపత్తులు దాడి చేస్తున్నాయి. గతంలో కురిసిన వర్షాలకు మెళియాపుట్టి మండలంలో ఎగుబందపల్లి, గూడ, కేరాశింగి, అడ్డివాడ, చందనగిరి ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి రహదారులపైకి వచ్చేశాయి. అటువంటి సమయాల్లో ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జనావాసాల్లోకి జంతువులు..

గడ్డితోపాటు చిట్టడవులు తగలబడటంతో జంతువులు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఎండవేడిమికి, అగ్ని జ్వాలలకు అటవీ ప్రాంతంలో నీరు దొరక్క అడవి పందులు, జింకలు, పక్షులు.. తదితర జంతువులు జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. జీడి, మామిడి, వరి, వేరుశనగ, మినుము వంటి పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో **(మిగతా 6వ పేజీలో..)**

జైలులో పరిచయం.. నాలుగు జిల్లాల్లో చోరీలు

- ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్టు
- 17 కేసుల్లో చోరీ చేసినట్టు గుర్తింపు
- రూ.45లక్షల ఆభరణాలు, వాహనం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాతోపాటు విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మొత్తం 17 కేసుల్లో నిందితులైన ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. 'పలాస, కాశీబుగ్గ పరిధిలో నర్సిపురం రైల్వేగేటు ఫ్లైఓవర్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిద్దరినీ పోలీసులు విచారించారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం జోగంపేటకు చెందిన పోల భాస్కరరావు, ఎచ్చెర్ల మండలం ముద్దాడపేటకు చెందిన ముద్దాడ నర్సింగరావులుగా వారిని గుర్తించారు. గతంలో వీరిద్దరిపై జిల్లాలో 16 దొంగతనాలు, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో ఒక చోరీకేసుతోపాటు, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలో కూడా దొంగతనం కేసులున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. వీరిద్దరూ గతేడాది పలాసలో దొంగిలించిన బంగారు ఆభరణాలను విక్రయించేందుకు వస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి సుమారు రూ.36.80లక్షల విలువైన 435.52 గ్రాములు(37తులాలు) బంగారు ఆభరణాలు, ఒక డైమండ్ బ్రాస్‌లెట్, డైమండ్ లాకెట్, సుమారు రూ.26వేల విలువైన 233.2 గ్రాములు(20తులాలు) వెండి వస్తువులు, రూ.25వేల నగదు, ఒక మోటారు సైకిల్, ఒక కారును స్వాధీనం చేసుకున్నామ'ని ఎస్పీ తెలిపారు.

- 'ఈ కేసులో నిందితుడైన ముద్దాడ నర్సింగరావు గతంలో రెండు ద్విచక్ర వాహనాలను కూడా దొంగతనం **(మిగతా 6వ పేజీలో..)**

ఇన్నాళ్లకు కదిలారు!

- వంశధార నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం
- హిరమండలంలో 16 ట్రాక్టర్లు స్వాధీనం

6లో

జల్‌జీవన్ పూర్తయ్యేదెప్పుడో

- ఈ వేసవికి కష్టమే
- సగానికిపైగా గ్రామాలకు పైపులైన్లు వేయని దుస్థితి
- నత్తనడకన పనులు

6లో

ఆటలకు సై

- ప్రభుత్వ పాఠశాలల్లో స్పోర్ట్స్ కిట్లు పంపిణీకి సిద్ధం

6లో

పదోతరగతి మూల్యాంకనం ప్రారంభం

గుజరాతీపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదోతరగతి మూల్యాంకనం గురువారం ప్రారంభమైంది. శ్రీకాకుళంలోని మహిళా కళాశాల రోడ్డులో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, మహాలక్ష్మీనగర్‌లోని చైతన్య స్కూల్ ఆవరణలో మూల్యాంకనం చేపడుతున్నారు. జిల్లాకు వేర్వేరు జిల్లాల నుంచి సుమారు 1,90,000 వరకు జవాబు పత్రాలు చేరాయి. మూల్యాంకనం ఏర్పాట్లను విశాఖపట్నం ప్రాంతీయ సంచాలకుడు బి.విజయ్‌భాస్కర్ గురువారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా టెక్కలి డిప్యూటీ డీఈవో పి.విలియం, చైతన్య పాఠశాలలో డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా శ్రీకాకుళం డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి వ్యవహరిస్తున్నారు. వారి పర్యవేక్షణలో ఏడుగురు అసిస్టెంట్ ఎగ్జామినర్స్, 934 చీఫ్ ఎగ్జామినర్స్, 268 మంది స్పెషల్ అసిస్టెంట్లు మూల్యాంకనం ప్రక్రియ చేపడుతున్నారు.


మూల్యాంకనం ప్రక్రియను పరిశీలిస్తున్న విశాఖ ప్రాంతీయ సంచాలకుడు విజయభాస్కర్

జల్‌జీవన్ పూర్తయ్యేదెప్పుడో?



హెడ్ చానల్‌ను ప్రారంభిస్తున్న నాటి సీఎం జగన్మోహన్ రెడ్డి(ఫైల్)



గ్రామాల్లో కుళాయిలకు ట్యాప్‌లు బిగించని వైనం..

- ఈ వేసవికి పూర్తవడం కష్టమే
- సగానికిపైగా గ్రామాలకు పైపులైన్లు వేయని దుస్థితి
- నత్త నడకన సాగుతున్న పనులు

కంచిలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి)

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జల్ జీవన్ మిషన్ పేరిట ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు 2019లో ప్రత్యేక పథకాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. ఐదేళ్ల కాల పరిమితిలో ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ మన రాష్ట్రంలో ఆ లక్ష్యం దిశగా పనులు కదల్లేదు. అప్పటి వైసీపీ ప్రభుత్వం పేదలకు ఎంతో మేలు చేసే జల్ జీవన్ మిషన్‌పై నిర్లక్ష్యం చూపడంతో పనులు నిలిచిపోయాయి. ఇటీవల పార్లమెంట్‌లో జల్ జీవన్ మిషన్ లక్ష్యం సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం మరలా నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో... ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో జల్ జీవన్ మిషన్ పనులను పరిశీలిద్దాం.





జల్ జీవన్‌మిషన్ నీటి ట్యాంకు

పైపులైన్లు ఏవీ?

అన్ని గ్రామాల్లోనూ ఇంటింటికీ కుళాయిలు వేసి.. తాగునీటిని అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ కార్యక్రమాన్ని చేపట్టింది. కంచిలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో ఈ కార్యక్రమం ప్రారంభించి ఆరేళ్లు పూర్తవుతోంది. కానీ 35 శాతం గ్రామాల్లో మాత్రమే పైపులైను పనులు పూర్తి చేశారు. ఇంకా పనులు ప్రారంభించని గ్రామాలు సగానికి పైగా ఉన్నాయి. దీన్ని బట్టి గతవైసీపీ ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహణపై ఎంత శ్రద్ధ చూపిందో అర్థం చేసుకోవచ్చు.

- కంచిలి మండలంలోని 144 గ్రామాలకు గాను మొదటి విడతలో 73 గ్రామాల్లో పైపు లైను పనులు పూర్తి చేశారు. ఈ గ్రామాలకు నీరందించేందుకు అంపురం, ఎన్.ముకుందపురం, అంపురం కాలనీ, కొత్త అంపురం, గూండాం, కేటీనౌగాం, నువాగడ, పోతుగుడ్డి ప్రాంతాల్లోని పాత నీళ్ల ట్యాంకులను ఉపయోగింగారు. కొత్తగా కొల్లూరు, ఎంఎస్‌పల్లి, సిర్తలి, పద్మతుల, మధుపురం, చౌత్రాయిపురం, జేఎల్ కోట గ్రామాల్లో నూతనంగా ట్యాంకులు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు.

ఈ వేసవికి పూర్తయ్యేనా?

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జల్ జీవన్ మిషన్ పనులు ఈ వేసవి నాటికి పూర్తయ్యే అవకాశాలు దాదాపు లేవనే చెప్పాలి. నాలుగు మండలాల్లోని ప్రధాన పంచాయితీల్లోనే ఇప్పటి వరకు పైపులైన్లు వేయని దుస్థితి నెలకొంది.

- సోంపేట మండలంలో మేజర్ పంచాయతీ అయిన బారువలో ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టలేదు.
- కవిటి పంచాయితీలో పెద్దదైన మాణిక్యపురంలో పనుల జాడే లేదు.
- కంచిలిలో బూరగాం పంచాయతీ, ఇచ్ఛాపురంలోని వివిధ పంచాయితీల్లో పనులు ప్రారంభం కాలేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఈ ఏడాది వేసవిలో కూడా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడాల్సిందేననే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. పనులు పూర్తయిన గ్రామాలకైనా సక్రమంగా నీటి సరఫరా చేస్తే, కొంత మందికైనా మేలు జరుగుతుందని ప్రజలు కోరుతున్నారు.

పూర్తి కాకుండానే ప్రారంభం..

పూర్తిస్థాయిలో పైపులైన్లు వేయకుండా, ఇంటింటికి కుళాయిలు, ట్యాప్‌లు బిగించకుండానే కంచిలి మండలం మఖరాంపురం వద్ద నిర్మించిన ప్రధాన హెడ్ చానల్‌ను అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ప్రారంభించేశారు. గ్రామాల్లో పైపు లైన్ల కోసం వేసిన గోతులను పూడ్చకుండానే ప్రతి ఇంటికీ తాగు నీటిని అందించేస్తున్నామంటూ చెప్పారు. ఉద్దానం ప్రజలకు తాగునీటిని అందిస్తున్న ఉద్దానం మంచినీటి పథకం నిర్వహణకు నిధులు నిలిపివేయడమే కాకుండా, మరోపక్క పనులు పూర్తి చేయకుండానే జల్‌జీవన్ మిషన్ పూర్తి చేశామని చెప్పుకోవడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది.

- కంచిలి మండలానికి జల్‌జీవన్ మిషన్ పనులకు సంబంధించి రూ.43 కోట్లు మంజూరు కాగా... మొదటి విడతలో రూ.9.2 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. రూ. 34 కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కార్యక్రమం ప్రారంభమై ఆరేళ్లు గడిచింది. కూటమి ప్రభుత్వంలోనైనా పనులు వేగవంతం చేసి, ఇంటింటికి తాగునీటిని అందిస్తారనే ఆశాభావాన్ని గ్రామీణ ప్రాంతవాసులు వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పనుల తీరు..

జల్ జీవన్ మిషన్ మొదటి దశలో రూ.9.2 కోట్లతో సగం గ్రామాల్లో పనులు జరగ్గా, మలివిడతలో నియోజకవర్గంలోని 357 గ్రామాల్లో పనులకు చర్యలు చేపట్టారు. వీటిలో సోంపేట మండలంలో 62 గ్రామాలు, కంచిలిలో 137, ఇచ్ఛాపురంలో 44, కవిటి మండలంలో 114 గ్రామాలు ఉన్నాయి.

- కంచిలి మండలంలో 18,700 ఇళ్లకు ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 5,500 ఇళ్లకే బిగించారు. జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేసి, ఉద్దానం ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేలా చూడాలని ఈ ప్రాంతీయులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఇంటింటి కుళాయిలు లేవు..



చాలా గ్రామాల్లో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. మా గ్రామంలో ఇప్పటి వరకు పనులే ప్రారంభించలేదు. ఇప్పటికైనా కుళాయిలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

-భాను, బూరగాం

పనులు వేగవంతం చేస్తాం..

ఎన్నికల నేపథ్యంలో నిధులు విడుదల, పనులు నిలిచిపోయాయి. వీటిని వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తాం.

-పీఎల్ఎన్ ప్రసాద్, డీఈ

ఆటలకు సై



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

- విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు
- క్రీడాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- అన్ని పాఠశాలలకు పంపిణీకి సిద్ధం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి)

పాఠశాలల స్థాయి క్రీడలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా కిట్లు ఇవ్వాలని నిర్ణయించింది. గత ఐదేళ్లలో పాఠశాలలకు క్రీడా కిట్ల పంపిణీలో జాప్యం జరిగింది. దీంతో ఆసక్తి ఉన్న చాలా మంది విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు. గత ఐదేళ్ల పాలనలో చివరి ఏడాది పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్లను వైసీపీ ప్రభుత్వం అందించింది. అంతకుమించి పాఠశాలల్లో క్రీడల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలల్లో క్రీడాభివృద్ధిపై దృష్టి సారించింది. పాఠశాలల వారీగా స్పోర్ట్స్ కిట్లు అందించనుంది. ఈ మేరకు వివరాలు కోరుతూ సమగ్ర శిక్ష ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1955, ప్రాథమికోన్నత పాఠశాలలు 269, ఉన్నత పాఠ శాలలు 414 ఉన్నాయి. విద్యార్థులు 1,71,535 మంది ఉన్నారు. వీరందరికీ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్‌కు సంబంధించి స్పోర్ట్స్ కిట్లు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏటా స్పోర్ట్స్ కిట్ల పంపిణీ జరిగేది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దీనికి బ్రేక్ పడింది. క్రీడా పోటీల నిర్వహణ లేకుండా పోయింది. 'ఆడుదాం ఆంధ్రా' పేరిట హడావుడి తప్ప పాఠశాల స్థాయి క్రీడా పోటీల నిర్వహణపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. మరోవైపు పాఠశాల ప్రాంగణాలు సైతం నాడు-నేడు పనులతో అస్తవ్యస్తంగా తయరయ్యాయి. కనీసం క్రీడా ప్రాంగణాల నిర్వహణ కూడా లేకుండా పోయింది. ప్రాంగణాలన్నీ ఎత్తు పల్లాలుగా మారి ఆడేందుకు కూడా అవకాశం లేకుండాపోయింది. దీంతో గత ఐదేళ్లుగా పాఠశాలల్లో క్రీడలు అన్న మాటనే విద్యార్థులు మరిచిపోయారు. తాజాగా ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో తల్లిదండ్రుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

వివరాలు సేకరిస్తున్నాం..

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. విద్యార్థులకు అవసరమైన స్పోర్ట్స్ కిట్లు వంటి వివరాలను నమోదు చేస్తున్నాం. ఇప్పటికే చాలా మండలాల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యింది. ప్రభుత్వం కిట్ల పంపిణీని ప్రారంభించనుంది, మరోవైపు క్రీడా మైదనాలను బాగుచేయడానికి కూడా ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో ఈ ప్రక్రియ కూడా ప్రారంభం అవుతుంది. త్వరలో జిల్లాలో గల అన్ని పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్లు అందజేస్తాం.

-తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం

నిప్పు.. అడవులకు ముప్పు

(ఐదో పేజీ తరువాయి)

వేటగాళ్ల ఉచ్చుకు వన్యప్రాణులు బలైపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాద కారణాలు గుర్తించి వనాలకు, పంటలకు, వన్యప్రాణులకు ముప్పు వాటిల్లకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నష్ట పరిహారమివ్వాలి..



అటవీశాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించాలి. ప్రత్యేక నిఘా వేసి కఠినచర్యలు తీసుకోవాలి. అటవీ ప్రాంతంలో నిప్పుపెడితే అడవులతో పాటు పంటలు కాలిపోతున్నాయి. కాలిపోయిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలి.

-డి.చంద్రశేఖరరావు, రైతు, జీఆర్‌పురం

చర్యలు తీసుకుంటున్నాం..



అడవులకు నిప్పుపెట్టే దుశ్చర్యలను రైతులు అడ్డుకోవటంతోపాటు అటవీశాఖాధికారులకు సమాచారం ఇవ్వాలి. ఆకతాయి చర్యలను గుర్తించడానికి ప్రత్యేక నిఘా వేసి.. వారిపై కఠినచర్యలు తీసుకుంటాం. అగ్ని ప్రమాదాల నివారణపై గ్రామాల్లో సదస్సులు, ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

-మురళీకృష్ణంనాయుడు, ఎఫ్ఆర్‌వో, కాశీబుగ్గ

జైలులో పరిచయం.. నాలుగు జిల్లాల్లో చోరీలు

(ఐదో పేజీ తరువాయి)

చేశాడు. 2018లో జైలుకు వెళ్లిన వీరిద్దరికీ అక్కడే పరిచయం ఏర్పడి, వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. దొంగిలించిన ఆభరణాలను విశాఖపట్నానికి చెందిన బోని గోవిందరాజులకు, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గ్రంథి శ్రీనివాసరావుకు, ఎచ్చెర్లకు చెందిన పొలం కృష్ణ, ఒడిశాకు చెందిన ముత్యాలుకు ఇచ్చినట్లు విచారణలో తేలింది. దొంగిలించిన కొంత సొమ్ముతో కారు కొన్నారు. వాస్తవానికి 17 కేసుల్లో 76 తులాల బంగారం చోరీ చేసినప్పటికీ.. 37 తులాలు రికవరీ చేశాం. త్వరలో మిగిలిన బంగారాన్ని కూడా రికవరీ చేస్తామ'ని ఎస్పీ స్పష్టం చేశారు. దొంగతనాల్లో వారిద్దరికీ సహకరించిన మరొకరి కోసం గాలిస్తున్నామని తెలిపారు. కేసులో ప్రతిభ చాటిన ఏఎస్పీ క్రైం పి.శ్రీనివాసరావు, కాశీబుగ్గ డీఎస్పీ వీవీ వెంకటప్పారావు, సీసీఎస్ సీఐ సూర్యచంద్రమౌళి, కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, సీసీఎస్ ఎస్ఐ కె.మధుసూదనరావు, గఫూర్, హెచ్‌సీ శ్యామసుందరరావు, పీసీలు భాస్కరరావు, విజయకుమార్, హరీష్, ఉషాకిరణ్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, రివార్డులు అందజేశారు. ఏఎస్పీ(అడ్మిన్) కె.వి.రమణ, ఎస్పీ సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు పాల్గొన్నారు.



కంప్యూటర్‌లో వివరాలు పరిశీలిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు

అందరికీ అందుబాటులో పోస్టల్ సేవలు

- పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామానికీ పోస్టల్ సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నట్టు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు తెలిపారు. స్థానిక సబ్‌పోస్టాఫీస్‌లో గురువారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 1.70 లక్షల ఖాతాలు తెరిపించామని చెప్పారు. ఖాతాదారులకు సేవలు సులభతరం చేసేందుకు ఇక్కడ కొత్తగా ఒక కౌంటర్‌ను ప్రారంభించామని తెలిపారు. పాస్ పుస్తకాల ప్రింటింగ్‌కు కొత్త ప్రింటర్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం పోస్టాఫీసు నిర్వహిస్తున్న భవనానికి మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సోంపేట డివిజినల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, పోస్ట్‌మాస్టర్ జ్ఞానేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఇన్నాళ్లకు కదిలారు

- భారీగా ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

హిరమండలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలింపుపై ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు కదిలారు. గొట్టా బ్యారేజీ నుంచి అంబావల్లి గ్రామం వరకు పోలీసుల సాయంతో దాడులు చేశారు. 16 ట్రాక్టర్లను తహసీల్దారు కార్యాలయం వద్దకు తరలించారు. మండలంలో అధికారిక రేవులు లేకపోయినా ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. భగీరథపురం, పిండ్రువాడ, అంబావల్లి తదితర గ్రామాల సమీపంలోని వంశధార నదీ గర్భంలో ఏడాది కాలంగా రాత్రీ పగలూ తేడా లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకున్నా అక్రమార్కులు ఇష్టానుసారంగా ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పథకాన్ని నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు నాయకులు సొంతంగా వంశధార నదిలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసుకొని పాతపట్నం, టెక్కలి, శ్రీకాకుళం, పలాస, తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖాధికారులు తమకేమీ పట్టనట్లు ఇన్నాళ్లూ ఊరుకున్నారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న ఒడిశా ట్రాక్టర్లు



తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

ఏమైందో ఏమో...

స్థానిక రెవెన్యూ అధికారులు గురువారం ఒక్కసారిగా కొరడా ఝుళిపించారు. వంశధార నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపారు. గత 10 నెలల కాలంగా లేనిది ఒక్కసారిగా ఏమైందో గానీ గొట్టా బ్యారేజి నుంచి అంబావల్లి గ్రామం వరకు పోలీసుల సాయంతో దాడులు చేశారు. సుభలయ, మెట్టతోట, పింద్రువాడ, మహాలక్ష్మీపురం గ్రామాల సమీపంలో వంశధార నదీ గర్భం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రంతో పాటు తెంబూరు, దనుపురం, సారవకోట, టెక్కలి వైపు అక్రమంగా తరలిస్తున్న మొత్తం 16 ట్రాక్టర్లను స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్దకు తరలించారు. ట్రాక్టర్ యజమానుల నుంచి అపరాధ రుసుం వసూలు చేయనున్నట్టు తహసీల్దారు హనుమంతరావు చెప్పారు. ఎస్ఐ ఎండీ యాసిన్‌తో పాటు ఆర్ఐ శంకరరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు దాడుల్లో పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో ఇసుక రీచ్‌కు అనుమతులు లేనప్పుడు ఎందుకు ఇన్ని ఇసుక ట్రాక్టర్లు తిరుగుతున్నాయి? ఈ ఇసుక ఎక్కడిది? ఎక్కడికి తరలిస్తున్నారన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

సాగునీటి వనరులపై నివేదిక: ఎస్ఈ



సుంకిలి సాగరాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ తిరుపతిరావు, రైతులు

కంచిలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన సాగునీటి వనరులు, రైతుల అవసరాలకు సంబంధించి ఉన్నతాధికారుల కు నివేదిక అందించను న్నట్టు వంశధార ఎస్ఈ ప్రగడ తిరుపతిరావు తెలిపారు. స్థానిక రైతులతో కలిసి గురువారం గంగాసాగరం, సుంకిలి సాగరం, గోవిందసాగరం, హెత్తా ట్యాంక్, ఊరట్యాంక్, రాకాసి గడ్డ తదితర సాగునీటి వనరులను పరిశీలించారు. వంశధార సాధన కమిటీ అధ్యక్షుడు ప్రధాన శివాజీ, దాలిబందు, కూటమి నాయకులు రామారావు, కృష్ణారావు, కామేష్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, వాసాల రమేష్‌రెడ్డి, సాడి ఆనందరావు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ హాకీ పోటీలకు జిల్లా క్రీడాకారుడు

శ్రీకాకుళం స్పోర్ట్స్ ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫాజుల్‌బేగ్‌పేటకు చెందిన తుంగాన వినయ్ జాతీయ హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి, సౌత్‌జోన్ స్థాయిలో ఎన్నోసార్లు సత్తాచాటిని వినయ్ ఈసారి రాష్ట్రస్థాయి ఎంపికల్లో ప్రతిభ చూపించి, సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. గత నెల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించడంతో ఏపీ హాకీ జనరల్ సెక్రటరీ గంధం హర్షవర్ధన్ తుది జట్టులో స్థానం ఇస్తున్నట్టు ప్రకటించారు. ఎంపికపై జిల్లా హాకీ సంఘం అధ్యక్షుడు పి.అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి జె.రమేష్, పి.బాలమురళీకృష్ణ, ఎ.అనిల్‌కుమార్, సంఘ సభ్యులు ఎస్.మధు, యు.మనోజ్‌కుమార్, బి.ఈశ్వర ప్రసాద్ తదితరులు అభినందించారు.

శిథిలావస్థలో నాగావళి రివర్‌వ్యూ పార్క్





పాడైపోయిన సామగ్రి

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున ఉమారుద్రకోటేశ్వర ఆలయం వద్ద ఉన్న నాగావళి రివర్ వ్యూ పార్కు శిథిలావస్థకు చేరుకుంది. పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు కాసేపు కూర్చొనేందుకు వీలుగా ఆహ్లాదం వాతావరణంలో 2002లో అప్పటి ఎంపీ దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు నిధులు వెచ్చించి దీన్ని నిర్మించి నగరపాలక సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. నాగావళి నది ఒడ్డున ఆహ్లాదకర వాతావరణంలో దీనిని ఏర్పాటు చేయడంతో చాలా మంది నగరవాసులు అక్కడికి చేరుకుని సందడిగా గడిపేవారు. చక్కటి రంగులతో గాంధీ మహాత్ముడు, స్వామి వివేకానంద, సూర్యదేవుని చిత్రాలే కాకుండా సుమారు 50 అడుగుల పైన గోడమీద సర్పం ప్రతిమ, చిన్న పిల్లలు ఆడుకోవడానికి జారుడు బల్ల, ఊయల వంటి క్రీడా సామగ్రి ఏర్పాటు చేశారు. పక్కనే ఉమారుద్ర కోటేశ్వర ఆలయం ఉండడంతో ఏటా శివరాత్రి పర్వదినాన ఇక్కడో సందడి వాతావరణం నెలకొనేది. అలాగే లైన్స్ క్లబ్ మెంటర్ నటుకుల మోహన్ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం, స్టేజ్ నిర్మాణం చేయించారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే..

గత వైసీపీ ప్రభుత్వంలో నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోకపోవడంతో రంగులు వెలిసిపోవడంతో కళావిహీనంగా మారింది. బెంచీలు, జారుడుబల్ల, రంగులరాట్నం తదతర పరికరాలు తుప్పుపట్టి పాడైపోతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. అదేవిధంగా నెహ్రూ విగ్రహం తల ధ్వంసమైంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ పార్కుకు పూర్వ వైభవం తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు.

రోడ్డు పక్కనే చెత్త కుప్పలు



గార హైస్కూల్ రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త

గార, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం గారలో జడ్పీ.హై స్కూల్ పక్క నుంచి వంశధార నది వైపు వెళ్లే రహదారి పక్కనే పెద్దఎత్తున చెత్త కుప్పలుతో దుర్గంధంగా ఉంది. ఈ రోడ్డుకు పక్కనే ఒక వైపు ఎంఆర్‌సీ భవనం, మండల పశువైద్యశాల, మరో వైపు అంగన్‌వాడీ కేంద్రం, హైస్కూల్ ఉన్నాయి. ఈ రోడ్డు గుండా వంశధార నదికి వెళ్లి వచ్చేవారు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అర్ధరాత్రి సంచరిస్తే చర్యలు



డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ఎటువంటి కారణం లేకుండా అర్ధరాత్రులు బహిరంగంగా తిరిగే వారిపై కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేర నియంత్రణ చర్యల్లో భాగంగా రాత్రి సమయాల్లో గస్తీ, పెట్రోలింగ్ నిర్వహించే సమయాల్లో సరైన కారణాలు లేకుండా రోడ్లపై తిరుగుతూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు, నగరంలోని ప్రధాన కూడళ్లలో నిరంతర తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. రాత్రి 11 గంటల తర్వాత వ్యాపారాలు, దుకాణాలు, టిఫిన్ బండ్లు మూసివేయా లని, అనుమతులు లేకుండా వ్యాపారాలు సాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.

ఒంటిపూట బడులు పక్కాగా అమలు చేయాలి

అరసవల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఒంటిపూట బడులను పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖాధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. వివిధ పాఠశాలల్లో నేటికీ 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట రెండు పూటలు, అలాగే సాయంత్రం నాలుగు గంటల నుంచి 8 గంటల వరకు పరోక్షంగా తరగతులు నిర్వహిస్తున్నట్టు కమిషన్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. అటువంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేసి, వారిపై క్రిమినల్ చర్యలకు సిఫారసు చేస్తామన్నారు.

నిర్వహణపై దృష్టి సారించాలి

జి.సిగడాం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో రాజేంద్రప్రసాద్‌బాబు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్‌డబ్ల్యూఎస్ కేంద్రాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారిని చైతన్య వంతులు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో జి.రామకృష్ణ, రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష వాయిదా

బూర్జ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కొల్లివలసలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశానికి ఈ నెల 6న నిర్వహించాల్సిన పరీక్ష 13వ తేదీకి వాయిదా వేసినట్టు ప్రిన్సిపాల్ దేవేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతికి, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

పీజీ, ఇంజనీరింగ్ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థుల వివిధ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసినట్టు వర్సిటీ ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ గురువారం తెలిపారు. పీజీ కోర్సుకు సంబంధించి నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి, ఇంజనీరింగ్ 8వ సెమిస్టర్, ఎంసీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 24 నుంచి, బీపీఈడీ, డీపీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 23 నుంచి జరుగుతాయన్నారు. వర్సిటీ కేంద్రంగా జరిగే ఈ పరీక్షలకు ఈ నెల 14వ తేదీలోగా ఫీజు చెల్లించాలన్నారు.

రాజకీయ కక్షతోనే ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు

సోంపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్షల కారణంగానే కొర్లాం, బారువ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వైస్‌ఎంపీపీ గుర్రాల శ్రీనివాస్, బీఆర్‌సీ పురం సర్పంచ్ బుద్దాన రోహిణి ఆరోపించారు. ఎంపీపీ నిమ్మన దాసు అధ్యక్షత మండల పరిషత్ సర్వసభ సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. పలసపురం సర్పంచ్ తడక జోగారావు, ఎంపీటీసీ పొడుగు కామేష్, ధర్మారావు మాట్లాడుతూ.. బిరుసువాడ కాలనీలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. పూర్తిస్థాయిలో అనుమతులు లేకుండానే నిర్మాణాలు సాగిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ, మంగి గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

బూర్జ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చీడివలస పంచాయతీ పరిధిలో గురువారం ఉపాధి పనులు ప్రారంభయ్యాయి. గ్రామంలో పనులకు అవకాశం లేకపోవడంతో కూటమి నాయకుడు పిల్లా కన్నంనాయుడు చొరవతో కొల్లివలసలోని నాతన చెరువులో పనులను గురువారం ప్రారంభించారు. వేతనదారులందరికీ వంద రోజులు పనికల్పించడమే లక్ష్యమన్నారు. ఇటీవల రూ.307 వేతనం పెంపు హర్షణీయమన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.సిగడాం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పాలఖండ్యాం 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనుండడంతో పలు గ్రామాలకు శుక్రవారం సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఈఈ పి.యోగేశ్వరరావు, ఏఈ పి.దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఫీడర్‌లో ఆనందపురం, దవళపేట, సంతవురిటి, ఆబోతులపేట, పాలఖండ్యాం, మెట్టవలస, మర్రివలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

● గార, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చల్లపేట విద్యుత్తు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 4వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ పైడి యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజున ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంపోలు, ఆడవరం, చల్లపేట, శ్రీకూర్మం, దీపావళి, రామకృష్ణాపురం, సిమ్మపేట తదితర గ్రామాల పరిధిలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని కోరారు.

● ఎచ్చెర్ల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎచ్చెర్ల, కొయ్యాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పైడి యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు, నిర్వహణ పనుల కోసం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఎచ్చెర్ల, కొయ్యాం, నిమ్మవానిపేట, కొత్తవానిపేట, అజ్జరాం గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

రూ.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాలకు ఆసరాగా నిలిచేది ముఖ్యమంత్రి సహాయనిధి అని, దీని ద్వారా ఎన్నో కుటుంబాలు సహాయం పొందుతున్నాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక విశాఖ-ఏ కాలనీలో గల తన కార్యాలయంలో ఆయన గార మండలం, రామచంద్రాపురం గ్రామానికి చెందిన గొలివి ప్రతాప్‌కు వైద్య ఖర్చుల కోసం రూ.10లక్షలు సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాలను గురువారం అందజేశారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా రౌతు



సూర్యనారాయణ

అరసవల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై జాతీయ భద్రతా చట్టం 2013లో భాగంగా జిల్లా, మండల ఏఫ్‌పీ షాప్ లెవెల్ విజిలెన్సు కమిటీ సభ్యుడిగా ఎండీయూ ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్త పెన్షన్ బిల్లును ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న కేంద్ర పెన్షనర్ల యూనియన్ నాయకులు

అరసవల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఏకపక్షంగా తీసుకువస్తున్న కొత్త పెన్షన్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు వెంకటరావు పాణిగ్రాహి, ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా స్థానిక పోస్టల్ కార్యాలయం వద్ద గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇటీవల కేంద్రం పార్లమెంట్ సభ్యుల పారితోషికాలను ఎటువంటి చర్చలు జరపకుండా పెంచారని, 35 నుంచి 40 ఏళ్ల పాటు ప్రజలను అనేక సేవలందించిన పెన్షనర్లకు మాత్రం పెన్షన్ రివిజన్స్ ఎగనామం పెట్టడానికి బిల్లును ఆమోదించడం అన్యాయమన్నారు. ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించాలని, లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెన్షన్ పెంపుదల అనేది భారత రాజ్యాంగంలోని 'ఆర్టికల్-14'లోని ఆదేశాలని, వాటిని ఇప్పుడు ఉల్లంఘించడం ఎంతమాత్రం సరికాదన్నారు. ఈ ధర్నాలో నాయకులు ఎం.పాపారావు, మన్మధరావు, ఎంవీ రామారావు, పాణిగ్రాహి, ఎం.గోవర్ధనరావు, కె.గోపాలరావు, హెచ్.డిల్లేశ్వరరావు, పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలల్లో నాలుగు కొలువులు



బాలమురళిని అభినందిస్తున్న తల్లిదండ్రులు

సరుబుజ్జిలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): షలంత్రి గ్రామ పంచాయతీ మర్రిపాడు గ్రామానికి చెందిన వాకముళ్ల బాలమురళి నాలుగు నెలల్లో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. తండ్రి రమణ మూర్తి న్యాయవాది కాగా తల్లి జానకి గృహిణి. వీరికి ఇద్దరు కుమారులు చిన్న కుమారుడు నవీన్ ఇప్పటికే ఏడాదికి కోటి రూపాయల ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో రాణిస్తున్నాడు. పెద్ద కుమారుడు బాలమురళి బీటెక్ పూర్తి చేసి బ్యాంకు ఉద్యోగాలకు శిక్షణ పొందాడు. 2020 సంవత్సరంలో విడుదలైన రూరల్ బ్యాంక్ ఆర్‌ఆర్‌బీ పీవో క్లర్క్ ఫలితాల్లో ఉత్తీర్ణుడై ప్రస్తుతం చైతన్య గోదావరి బ్యాంకులో పీవోగా విధులు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ఇటీవల విడుదలైన ఐ బీపీఎస్ పీవోతో పాటు క్లర్క్ ఉద్యోగానికి కూడా అర్హత సాధించాడు. అ లాగే బుధవారం విడుదలైన ఆర్‌పీఎఫ్ సబ్ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. బాలమురళి ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై తల్లిదం డ్రులు రమణమూర్తి జానకితోపాటు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

బాల్ బ్యాడ్మింటన్ పూర్వవైభవానికి కృషిచేస్తా



ఎంపీ కలిశెట్టికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బాల్ బ్యాడ్మింటన్ పూర్వ వైభవానికి కృషిచేస్తానని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు డిల్లీలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు రుప్ప రమణమూర్తి కలిశారు. భారత క్రీడా మంత్రిత్వ శాఖ బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 1959లో గుర్తింపు ఇచ్చిందని, నాటి నుంచి 2021 వరకు జాతీయ క్రీడల్లో 62ఏళ్లు కొనసాగించారని, 2022 నుంచి ఎటువంటి ప్రత్యుత్తరాలు లేకుండా గుర్తింపు రద్దు చేశారని వివరించారు. బాల్ బ్యాడ్మింటన్ ఆంధ్రప్రదేశ్‌తోపాటు దక్షిణ భారత దేశంలో అత్యంత ప్రాచుర్యం పొందిందని, ఆ క్రీడ నుంచి ఆరుగురు అర్జున అవార్డులు కూడా పొందారన్నారు. అటువంటి ఆటకు నేడు గుర్తింపు లేకుండా అయిపోయిందని జిల్లా అధ్యక్షుడు వివరించారు. వీటిపై ఎంపీ స్పందిస్తూ ఈ క్రీడ పునరుద్ధరణకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఒక వినతి పత్రాన్ని అందజేశారు.

టీడీపీ పాలనలోనే విద్యాభివృద్ధి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్

ఆమదాలవలస, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలో రాష్ట్రం సంపూర్ణ విద్యాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. గురువారం తొగరాం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన పాఠ్యపుస్తకాల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ విద్యావిధానంలో వినూత్న మార్పులు తీసుకొస్తున్నారన్నారు. ఇంటర్మీడియట్ కొత్త ఏడాది తరగతులను ప్రారంభించిన తర్వాత వేసవి సెలవులు ప్రకటించినందున పాఠ్యపుస్తకాలను కూడా ముందుగానే రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



ఇచ్ఛాపురం: తేలుకుంచిలో సీసీ కెమెరాలు అందజేస్తున్న దృశ్యం



గార: చర్చి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణలో భాగంగా ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. స్థానికుల సహకారంతో గురువారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన దేవాలయాల్లో సైతం విడతల వారీగా వీటిని ఏర్పాటు చేస్తామన్నారు.

● గార, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అంపోలు దగ్గర చర్చిలో గురువారం భద్రత దృష్ట్యా నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ ఆర్.జనార్దనరావు తెలిపారు.

పరిశుభ్రత పాటించండి



అల్పాహారంపై ఆరా తీస్తున్న కమిషనర్

ఆమదాలవలస, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్ ప్రాంతంలో పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని మునిసిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ అన్నారు. గురువారం ఉదయం పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను ఆయన సందర్శించి ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందరంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్న క్యాంటీన్‌లో పేదలకు రుచికరమైన భోజనాన్ని టిఫిన్ అందజేయాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

టీడీపీ నేతకు పరామర్శ



మహేష్‌తో మాట్లాడుతున్న నాగార్జున

లావేరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల తెలుగు యువత అధ్యక్షుడు, అప్పాపురం మాజీ సర్పంచ్ గంట్యాడ మహేష్‌ను గురువారం విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున పరామర్శించారు. మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న నాగార్జున ఆయన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

బీసీ రుణ దరఖాస్తుల పరిశీలన



అరసవల్లి: దరఖాస్తుల పరిశీలన జరుగుతున్న దృశ్యం

అరసవల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా అందించనున్న సబ్సిడీ రుణాలకు వచ్చిన దరఖాస్తులను గురువారం స్థానిక బాపూజీ కళామందిర్‌లో మున్సిపల్ సిబ్బంది, బ్యాంకు అధికారులు పరిశీలించారు. నగర పరిధిలో 1200 పైగా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల పరిశీలన తర్వాత అర్హులైన వారికి తదుపరి సమాచారం వారి వారి సెల్‌ఫోన్లకు ద్వారా అందజేస్తామని అధికారులు తెలిపారు. వివిధ బ్యాంకుల సిబ్బంది, పెద్ద ఎత్తున దరఖాస్తుదారులు హాజరయ్యారు.

● ఇచ్ఛాపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా అందించనున్న రుణాలను లబ్ధిదారులు వినియోగించుకోవాలని పురపాలక కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం లబ్ధిదారుల దరఖాస్తులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూకు 327 మంది హాజరైనట్టు తెలిపారు. ప్రక్రియలో బ్యాంకు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

● ఆమదాలవలస, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్స్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ అన్నారు. గురువారం పురపాలక సంఘం కార్యాలయంలో సబ్సిడీ రుణాల దరఖాస్తుదారులను బ్యాంకు అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. పురపాలక సంఘంలో 23 వార్డులకు 69 యూనిట్లు మంజూరు కాగా.. 489 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో వివిధ బ్యాంకుల మేనేజర్లు, పురపాలక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● కంచిలి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా అందించనున్న రుణాలకు సంబంధించిన ఇంటర్వ్యూకు 348 మంది లబ్ధిదారులు హాజరైనట్టు ఎంపీడీవో వి.తిరుమలరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియలో ఏవో హెచ్‌వీ రమణమూర్తి, ఈవోపీఆర్డీ కె.ఈశ్వరి, బ్యాంకు సిబ్బంది, పాల్గొన్నారు.

రోడ్లపైన.. దుకాణాల చెంతన

● కాంప్లెక్స్ మూతతో ప్రయాణికులకు అగచాట్లు ● నివగాంలో బస్సులకోసం నిరీక్షణ

కొత్తూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నివగాం ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ మూసి వేయడంతో ప్రయాణికులు అగచాట్లకు గురవుతున్నారు. రోడ్లపైనే ఆరుబయట, దుకాణాల వద్ద బస్సుల కోసం నిరీక్షించాల్సివస్తోంది. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన నివగాం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను గత ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు లీజుకు అప్పగించిన విషయం విదితమే. దీంతో లీజు దక్కించుకున్న నిర్వాహకులు కాంప్లెక్స్ చుట్టూ మూసివేశారు. ఈ నేపథ్యంలో బస్సుల కోసం ప్రయాణికులు మండుటెండల్లో ఆరుబయట నిరీక్షించాల్సివస్తోంది. కాంప్లెక్స్ తెరిపించి ప్రయాణికులకు నీడ కల్పించాలని పలుసార్లు ప్రజలు, ప్రజా సంఘాలు ధర్నాలు, నిరసనలు తెలియజేసిన విషయం విదితమే. ప్రస్తుతం వేసవికావడంతో ఎండల తీవ్రత పెరగడంతో బస్సులు కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. కొందరు దుకాణాల చెందతన తలదాచుకోవల్సి వస్తోంది. నివగాం ఒడిశాకు దగ్గరలో ఉండడంతో ఆ రాష్ట్ర ప్రజలతోపాటు మండలంలోని పలు గ్రామాల ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఇక్కడకు వస్తుంటారు.


నివగాంలో ఆరుబయట మండుటెండలో నిరీక్షిస్తున్న ప్రయాణీకులు

పనులు పూర్తికాక.. ప్రారంభానికి నోచుకోక

●నిర్మాణ దశలోనే శిథిలావస్థకు చేరుతున్న వైనం ● ఇదీ ఎల్.ఎన్.పేటలోని స్త్రీశక్తి భవనం పరిస్థితి

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 3 ఆంధ్రజ్యోతి): ఎల్.ఎన్.పేటలో స్త్రీశక్తి భవన నిర్మాణం 15 ఏళ్లుగా పూర్తికాకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడంలేదు. దీంతో నిర్మాణదశలోనే శిథిలావస్థకు చేరుకుంటోంది.మహిళా సంఘసమావేశాలు, కార్యకలాపాల నిర్వహణకోసం ఎల్.ఎన్.పేటలో స్త్రీశక్తి భవనం మంజూరుచేశారు. దీంతో సుమారు రూ.30 లక్షలు భవనం నిర్మాణానికి మంజూరయ్యాయి. దీంతోటెండరు ఖరారుకావడంతో పనులు ప్రారంభం కాగా నిధులు విడుదలైన మేరకు రెండుఫ్లోర్లు వేసిన తర్వాత నిలిచిపోయాయి. భవనం చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. ఖాళీగా ఉండడంతో స్థానికులు పశువుల కొట్టంగా వినియోగిస్తున్నారు.ఈ భవనానికి ఒకవైపు మండల పరిషత్ కార్యాలయం, మరోవైపు ప్రాథమిక పాఠశాల ఉన్నాయి.మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు వేదికగా మారడంతో స్థానికులు అవస్థలకుగురవుతున్నారు. ప్రస్తుతం నిధులకొరత వల్ల పనులు ముందుకుసాగడంలేదని అధికారులు చెబుతున్నారు.


అర్ధాంతరంగా నిలిచిపోయిన స్త్రీశక్తి భవనం

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

●ఆయా కుటుంబసభ్యుల్లో విషాదఛాయలు

జిల్లాలోని వేర్వేరు చోట్ల గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. నందిగాం దగ్గర ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొనడంతో షిఫ్ట్ ఆపరేటర్, మందస మండలంలోని బిన్నల మదనాపురం వద్ద లారీ బోల్తాపడడంతో డ్రైవర్ మృత్యువుపాలయ్యారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

డివైడర్‌ను ఢీకొని షిఫ్ట్ ఆపరేటర్..


రవికిరణ్ (ఫైల్)

నందిగాం/జలుమూరు,ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నందిగాం పోలీస్‌స్టేషన్ సమీపంలో గల జాతీయరహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యుత్ షిఫ్ట్ ఆపరేటర్ సంపతిరావు రవికిరణ్(38) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. జలుమూరు మండలంలోని కరవంజ గ్రామానికి చెందిన రవికిరణ్ పలాసలో విధులు నిర్వహించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. నందిగాం వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలుకావడంతో చికిత్సనిమిత్తం 108 వాహనంలో టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య తేజేశ్వరి, ఇద్దరు కుమార్తెలు ఫోక్షిత, మోనిష, తల్లి వెంకటరమణమ్మ ఉన్నారు. తండ్రి గజపతి మూడేళ్ల కిందట మరణించడంతో కుటుంబం పోషణ బాధ్యతలు రవికిరణ్ చూసుకొనేవాడు.ఈ నేపథ్యంలో రవికిరణ్ మృతిచెందడంతో తల్లి వెంకటరమణమ్మ,తేజేశ్వరి విలపిస్తున్నారు. కరవంజలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇటీవల నరసన్నపేటలో జరిగిన డేఅండ్ నైట్ క్రికెట్ మ్యాచ్‌కి రవికిరణ్ ఎంపైర్‌గా వ్యవహరించాడు. కాగా భార్య ఫిర్యాదు మేరకు నందిగాం హెచ్‌సీ జీవీ రమణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తాపడి డ్రైవర్..

హరిపురం ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి):మందస మండలంలోని బిన్నల మదనాపురం వద్ద జాతీయరహదారిపై లారీ బోల్తాపడడంతో గుంటూరు జిల్లా పెద్దకూరపాడుకు చెందిన డ్రైవర్ ఎస్‌కే ఖాజా(42) మృతి చెందాడు. క్లీనర్ వి.నందనం గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు నుంచి భువనేశ్వర్ మిరపకాయలలోడుతో వెళ్తున్న లారీ బిన్నల వద్ద అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో పొలంలో లారీ బోల్తాపడుతుండాన్ని గుర్తించి డ్రైవర్ లారీ నుంచి కిందికి దూకాడు. అయితే ఆ సమయంలో డ్రైవర్‌పై బోల్తాపడడంలో లారీ కింద ఇరుక్కున్నాడు. దీంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు.గాయపడిన క్లీనర్‌ను జాతీయరహదారి అంబులెన్స్‌పై హరిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మందస ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.లారీని రోడ్డుపైకి తీసి డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం కోసం హరిపురం ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాయిపాడు ఘటనపై దర్యాప్తు

●నగదు రికవరీ, బంగారం స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని రాయిపాడులో ఓ వ్యక్తి విచ్చలవిడిగా డబ్బులు పంచిపెడుతున్నాడన్న సమాచారం మేరకు శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు రూరల్ పోలీసులను దర్యాపునకు ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన క్రైం పార్టీ పోలీసులు రాయిపాడులో దర్యాప్తు నిర్వహించారు. పోలీసుల కథనం మేరకు.. రాయిపాడుకు చెందిన అంజూరి కృష్ణ అలియాస్ బుడ్డి కోల్‌కతాలో బడా బజార్, మచువాచిట్‌పు ఏరియాలో రత్నకుమార్ నేత్ర అలియాస్ పప్పుస్వామి అనే వస్త్ర వ్యాపారి వద్ద భార్యతో రూ.ఆరు వేలకు పనికి కుదిరాడు. జీతం పెంచమని యజమానిని కోరినా పెంచలేదు. ఈ క్రమంలో కోల్‌కతాలో ధీరజ్ అనే వ్యక్తి నుంచి రూ. 20 లక్షలు తీసుకురమ్మని యజమాని కృష్ణకు చెప్పాడు. అయితే జీతం పెంచకపోవడం, చేతిలో పెద్ద మొత్తంలో డబ్బులు పడడంతో కృష్ణ కోల్‌కతా నుంచి ఆ సొమ్ము పట్టుకుని భార్యతో సహా రాయిపాడుకు ఉగాది ముందురోజు చేరుకున్నాడు. అప్పటినుంచి మద్యంతాగుతూ, గ్రామంలో అడిగిన వారికి మద్యం ఇప్పిస్తూ, అవసరంలో ఉన్నవారికి డబ్బులు పంచిపెట్టాడు. ఈనేపథ్యంలో సీఐకె.పైడపునాయుడు క్రైంసిబ్బందితో దర్యాప్తు నిర్వహించారు. సుమోటాగా రూరల్‌పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ రాము కేసునమోదు చేసి అంజూరు కృష్ణను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు.. కాగాఅంజూరి కృష్ణ తెలియజేసిన వివరాల మేరకు రూ.4.99లక్షల నగదు రికవరీచేయగా,నాలుగు ఉంగరాలు, సుమారు ఏడున్నర తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పైడపునాయుడు తెలిపారు.ఈవ్యవహారంపై లోతుగా దర్యాప్తుచేస్తున్నట్టు చెప్పారు.

తండ్రీకుమారులపై కత్తితో దాడి

కోటబొమ్మాళి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిన్నసాన పంచాయతీ పరిధిలోగల గంగుపేట గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ చదునుపల్లి రాము అదే గ్రామానికి చెందిన చదునుపల్లి అప్పన్న, ఆయన కుమారుడు హరిబాబులపై గురువారం కత్తితో దాడిచేసితీవ్రంగా గాయపరిచాడు.ఎస్‌ఐ వి.సత్యనారాయణ కథనం మేరకు.. చదునుపల్లి అప్పన్నకు తన అన్న కుమారుడు చదునుపల్లి రాముకు మధ్య ఇటీవల భూ వివాదం చోటుచేసుకుంది.ఈనేపథ్యంలోనే గురువారం మాటామటా పెరిగింది.ఆసమయంలో రాము కత్తిలో అప్పన్నపై దాడిచేశాడు.అక్కడే ఉన్న అప్పన్న కుమారుడు హరిబాబు అడ్డుకనే ప్రయత్నంలో హరిబాబు కూడా గాయపడ్డాడు. దీంతో గ్రామస్థులు గాయపడిన తండ్రీకొడు కులను 108లో టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యంకోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తర లించారు. ఈ మేరకు ఎస్‌ఐ వి. సత్యనారాయణ కేసు నమోదుచేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలో డ్రైంకెన్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ తీర్పు చెప్పినట్టు ట్రాఫిక్ సీఐ నాగరాజు తెలిపారు. సీఐ కథనం మేరకు.. తనిఖీల్లో ఎచ్చెర్ల మండలం గొల్లపేటకు చెందిన బి.గోవిందరావు డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో 20 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పువెలువరించారు.

గంజాయితో ఒకరి అరెస్టు

సోంపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి బాపట్ల జిల్లాకు గంజాయి తరలిస్తున్న ఒడిశాకి చెందిన బిప్ర దళాయిని అరెస్టు చేసినట్టు సీఐ మంగరాజు తెలిపారు. ఈమేరకు ఎస్‌ఐ లవరాజుతో కలిసి సీఐ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు.బాపట్ల జిలాల్లో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు.ఒడిశాలోని స్వగ్రామం నుంచి గంజాయితో కంపెనీకి వెళ్తుండగా కొర్లాం జంక్షన్‌లో పోలీసులకు పట్టుబడ్డారు. అతడి నుంచి 1.050 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

మునిసిపాలిటీ అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే


శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న ఆటో కార్మికులు, సంఘప్రతినిధులు

కాశీబుగ్గ,ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ అభివృద్ధే ధ్యేయమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు.గురువారం మునిసిపాలిటీ పరిధిలోని శాంతి నగర్, తాళభద్ర, రాజంకాలనీ, పెద్దబ్రాహ్మణ వీధి, నీలాపురం, నర్సిపురం తదితర ప్రాంతాల్లో సీసీరోడ్లు, మురుగు కాలువలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే కాశీబుగ్గ న్యూకాలనీలో మునిసిపల్ సాధారణ నిధులు రూ.20లక్షలతో నీటి ట్యాంకులను ప్రారంభించారు.కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ రామారావు, ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్, రామకృష్ణ, సత్యం,తిరుమలరావు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

పలాస,ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):ఆటోకార్మికుల సమస్యలను మంత్రి అచ్చెన్నాయుడుతో మాట్లాడి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. గురువారం ఆటో కార్మికుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మికసంఘ నాయకులు మాట్లాడుతూ ఎచ్చెర్ల వెళ్లి ఫిటినెస్ పరీక్షలు చేయించుకోవాలంటే 200 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. కార్యక్రమంలో ఆటో కార్మికసంఘ గౌరవాధ్యక్షుడు దువ్వాడ శ్రీకాంత్, సంఘ అధ్యక్షుడు గోపి పాల్గొన్నారు.

ఊయల పథకం ప్రారంభం

పలాస ప్రభుత్వాసుపత్రిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పసిపిల్లల ఊయల పథకాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ అంగవైకల్యంతో జన్మించిన పిల్లలను అనేక ప్రాంతాల్లో ముళ్ల పొదలు, చెరువు గట్లు, కాలువల్లో విడిచివారి జీవితాలను నాశనం చేస్తున్నారని, అటువంటి వారికోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఊయల ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పీఓ పార్వతి, సూపర్‌వైజర్లు సునీత, లత, గంగమ్మ, సరస్వతి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పలాసలోనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

● ఆర్టీసీ కార్మిక సంఘ గౌరవాధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్


మాట్లాడుతున్న శ్రీధర్

పలాస, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పలాసలోనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ కార్మికసంఘ గౌరవాధ్యక్షుడు, షిర్డీ సాయిబాబా సంస్థాన్ వ్యవస్థాపకుడు దువ్వాడ శ్రీధర్ కోరారు. గురువారం పలాసలో విలేకరులతో మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో ఐదువేల మంది ఆటోకార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఆటోలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు శ్రీకాకుళం ఆర్టీవో కార్యాలయంలో తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వడంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటి వరకూ పలాసలో ఎంవీఐ కార్యాలయంలో జారీచేసేవారని తెలిపారు. ఇక నుంచి శ్రీకాకుళంలో తీసుకోవాలని ఆదేశాల రావడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు.

సదరం ధ్రువపత్రాల పునఃపరిశీలన

నరసన్నపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):నరసన్నపేట సీహెచ్‌సీలో గత ప్రభుత్వంలో దివ్యాంగులకుజారీచేసిన సదరం ధ్రువపత్రాలను పునఃపరిశీలన చేస్తున్నారు. గురువారానికి నరసన్నపేట మండలంలో 575, జలుమూరు మండలంలో 478 మందికి చెందిన ధ్రువప్ర తాలను పునఃపరిశీలన చేసినట్లు వైద్యులు తెలిపారు. ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం రెండునెలలుగా ధ్రువీకరణపత్రాలను ప్రత్యేక బృందాలు పునఃపరిశీలన చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసబాబు తెలిపారు. పోలాకి మండలంలోని 474 మంది ధ్రువపత్రాలను పరిశీలించునున్నట్లు ప్రత్యేక వైద్యబృందం సభ్యులు తెలిపారు.

పాతపట్నంలో చిత్రలేఖనం పోటీలు

పాతపట్నం, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని షిర్డీగిరిపై గల షిర్డీ సాయినాథుని ధ్యానమందిరంలో గురువారం వసంతోత్సవాల్లో భాగంగా మండలస్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.ఈ మేరకు 89మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహక ప్రతినిధి తారకేశ్వరరావు తెలిపారు. అనంతరం లలితసహస్రనామపారాయణం, భక్త సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించారు.

కొండ గొర్రెపై కుక్కల దాడి


కొండగొర్రెకు ప్రథమచికిత్స చేస్తున్న పశువైద్యాధికారులు, అటవీసిబ్బంది

పలాస, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అడవిలో నుంచి తప్పిపోయి జనావాసాల్లోకి వచ్చిన ఓ కొండగొర్రెను కుక్కలు గాయపరచడంతో అటవీశాఖసిబ్బంది రక్షించి పశువైద్యశాలలో సపర్యలు చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. అటవీశాఖ అధికారుల కథనం మేరకు.. ఎండల నేపథ్యంలో నీటికోసం కాశీబుగ్గ సమీపంలోగల పంట పొలాల్లోకి ఓ కొండ గొర్రె వచ్చింది. ఆ సమయంలో కుక్కలు దాడిచేశాయి. తర్వాత వెంబడించడంతో కాశీబుగ్గ డీఎస్పీ కార్యాలయం ఆవరణలో గాయాలతో విలవిలాడింది. ఈ విషయం తెలుసుకున్న ఈస్ట్రన్ ఘాట్ వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యుడు ఓంకార్‌త్యాడి, కాశీబుగ్గ అటవీశాఖ సిబ్బంది కృష్ణారావు, రాజు సంఘటన స్థలానికి చేరుకొని కొండగొర్రెను పట్టుకున్నారు. తోక, తొడలు, వెనుకకాలు భాగంలో కుక్కలు గాయపరిచినట్లు గుర్తించి, పశువైద్యాధికారులు కుట్లు, మందులు వేశారు. వారం రోజుల పాటు ఆసుపత్రి ఆవరణలోనే ప్రత్యేక పర్యవేక్షణలో గొర్రెను సంరక్షిస్తామని, గాయాలునయమైన తర్వాత అడవిలో విడిచిపెడతామని అటవీశాఖ అధికారులు చెప్పారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

రణస్థలం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తెప్పలవలస పంచాయతీ పరిధిలోని నక్కపేట గ్రామానికి చెందిన ఇరువర్గాల వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జేఆర్ పురం పోలీసుల వివరాల మేరకు.. మక్క అప్పలసూరి గురువారం తన పొలంలో ట్రాక్టర్‌తో ఎరువు వేయడానికి వెళ్లగా.. అదే గ్రామానికి చెందిన మక్క రాము అడ్డుకున్నాడు. ఈ వివాదం చిలికి చిలికి గాలివానగా మారి కొట్లాటకు దారితీసింది. ఈ కొట్లాటలో అప్పలసూరి వర్గానికి చెందిన ఎం.సంతు, ఎం.హరమ్మ, ఎం.స్రవంతి గాయపడ్డారు. అదేవిధంగా ఎం.రాము వర్గానికి చెందిన ఎం.అప్పుడు, ఎం.అసిరమ్మ, ఎం.ప్రసాద్, ఎం.చిన్నారావు గాయపడ్డారు. గాయపడిన వారు శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు జేఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేశారు.

కోటబొమ్మాళిలో ఈత చెట్లు దగ్ధం

కోటబొమ్మాళి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డులో పి.రాంబాబుకు చెందిన రెండు ఈత చెట్లు దగ్ధమయ్యాయి. గురువారం ఇక్కడ ఖాళీ స్థలంలో ఈత చెట్లకు సమీపంలో చెత్తకు నిప్పుపెట్టారు. చెత్తకు నిప్పుపెట్టి వారు ఇంటికి వెళ్లిపోయిన కొద్దినిమిషాల్లో నిప్పురవ్వలు ఈతచెట్టుపైకి ఎగసిపడి రాజుకొని దగ్ధమయ్యాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో శకటంతో చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చామని అగ్నిమాపక అధికారి పీఆర్ రెడ్డి తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

నరసన్నపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని జట్టు కళాసీ యూనియన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా చేపట్టిన వసంతోత్సవాల్లో భాగంగా గురువారం సీతారాములు కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో జట్టు కళాసీ యూనియన్ అధ్యక్షుడు నేతింటి జనార్దనరావు, పాగోటి రాజారావు, పురోహితులు వనమాళి కామేశ్వరరావు పాల్గొన్నారు.

నీలమణిదేవి అష్టోత్తర కలశస్నపనం పూజలు

జలుమూరు (సారవకోట) ఏప్రిల్ 3: సారవకోట మండలంలోని అవలింగిలోగల పాతపట్నం నీలమణిదేవి అమ్మవారి వసంత మూడు రాత్రుల మహోత్సవంలో భాగంగా గురువారం అష్టోత్తర కలశస్నపనం పూజలునిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో దీక్షాదంపతులతో పూజలు నిర్వహించినట్లు కమిటీసభ్యులు తెలిపారు.

ప్రభుత్వ బడిలో చదివించండి

● కొత్తపల్లిలో జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల అవగాహన



కొత్తపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోటబొమ్మాళి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధిస్తుండడంతోపాటు ఫీజుల ఒత్తిడి ఉండదని, నాణ్యమైన భోజనంతోపాటు అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చదివించాలని ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ మేరకు గురువారం మండలంలోని కొత్తపల్లిలో స్థానిక జడ్పీ పాఠశాల హెచ్‌ఎం గోవిందరావు, ఉపాధ్యాయులు షణ్ముఖరావు తదితరులు విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

రీసర్వేతో రైతులకు ప్రయోజనం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నందిగాం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తహసీల్దార్ పెద్దింటి సోమేశ్వరరావు తెలిపారు. గురువారం మండలం శివరాంపురం పంచాయతీ మొజ్జువాడలో రీసర్వేపై అవగాహన ర్యాలీ, గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతు సర్వేకు అందుబాటులో ఉండి తమ వివరాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ ఆర్.రామారావు, మండల సర్వేయర్ హనుమంతరావు, సర్పంచ్ ఎస్.జానకిరాం, వీఆర్‌వో ఎం.మురళీరావు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

పలాస రూరల్, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి):పలాస మండల పరిషత్ కార్యాలయంలో బీసీ రుణాలకోసం గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న వారి ధ్రువప త్రాలను పరిశీలించారు. కాగా మండలానికి 51 యూనిట్లు మంజూరయ్యాయి. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు, ఎంపీడీవో వసంత్‌కుమార్, ఈవోపీఆర్‌డీ వైకుంఠరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు పలాసలో..

పలాస, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పలాస-కాశీబు మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 31 వార్డులకు సంబంధించి 56 యూనిట్లకు 800 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు.

మత్స్యకార కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):మంచినీళ్లపేటకుచెందిన ఇద్దరు మత్స్యకారులు చేపలవేటకు వెళ్లి ప్రమాదంలో మృతిచెందగా ఆయా కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల్లోనే ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు టీడీపీకి చెందిన మత్స్యకార నాయకులు తెలిపారు.ఈ మేరకు గురువారం అక్కుపల్లిలో మాజీ వైస్‌ఎంపీపీ దాసరి జేజేరావు, మత్స్యకార క్లస్టర్ ఇన్‌చార్జి సింగుపల్లి బాలకృష్ణ విలేకరులతో మాట్లాడారు. ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షలు ప్రకటించినట్లు తెలిపారు. అలల తాకిడికి దెబ్బతిన్న బోటు యజమానికి తక్షణమే పరిహారంతో పాటు వల, ఇంజన్ అందజేసినట్లు చెప్పారు.

ఎక్సైజ్ అధికారుల నుంచి రక్షణ కల్పించాలి


డీటీ రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

హరిపురం ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): తమకు ఎక్సైజ్ అధికారులు వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని మందస వర్తక సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం మందసలో డీటీ రామకృష్ణకు ఆ సంఘం అధ్యక్షుడు వడ్డి గోపాల కృష్ణ ఆధ్వర్యంలో వ్యాపారులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సారాతయారీకిఅవసరమైన గిరిజనులకు నల్లబెల్లం విక్రయిస్తున్నామని వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. దుకాణాలు తనిఖీ చేసి విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని సూచించినా పట్టించుకోవడంలేదని వాపోయారు.పలాస, సోంపేట పోలీస్ స్టేషన్లకు పిలిపించి ఖాళీపేపర్లపై సంతాకాలు చేయించి కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని భాయందోళన వ్యక్తం చేశారు.ఇలాగే కొన సాగితే తామంతా వ్యాపారాలు మూసి వలసలే శరణ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మట్ట ధర్మారావు, కె.నరేష్, కె.మహేష్, శ్రవణ్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలి

టెక్కలి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పలాస డిపో కండక్టర్ ఎన్‌నీలకంఠం అక్రమ సస్పెన్షన్ రద్దుచేయాలని టెక్కలిడిపో ఈయూకార్యదర్శి ఎస్.మోహనరావు డిమాండ్ చేశారు. గురువారం టెక్కలి ఆర్టీసీ గ్యారేజ్ ఎదురుగా జోనల్ కమిటీ పిలుపుమేరకు ఆ సంఘంఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి భోజనవిరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ఉద్యోగులకు 1/2019 ఉత్తర్వులను అమలుచేయాలని, కొత్త బస్సులకు అనుగుణంగా అన్ని డిపోల్లో స్పేర్‌పార్ట్‌లు సప్లై చేయాలని, శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ మొండివైఖరి విడనాడాలని, ట్రాఫిక్ సిబ్బందికి దాడుల నుంచి భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బి.మురళి, ఎస్‌ఎస్‌వీ రమణ, కె.కృష్ణ, ఎర్రయ్య పాల్గొన్నారు.


టెక్కలి ఆర్టీసీ గ్యారేజ్ ఎదుట నిరసన తెలుపుతున్న ఈయూ నాయకులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూండి సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తబ్రేకర్లు, కొత్తలైన్లు ఏర్పాటు కోసం శుక్రవారంఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో పలాస ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.పూండి సబ్‌స్టేషన్ పరిధిలోగల వీఎం పురం, పూండి, అమలపాడు, కేఆర్‌పేట, పాత టెక్కలి, కొత్తపేట, దేవునల్తాడల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

●నందిగాం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనాపురం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయంకలుగుతుందని టెక్కలి విద్యుత్ ఈఈ జి.శంకరరావు తెలిపారు. మదనాపురం, కైజోలతోపాటు ఇండస్ట్రియల్ ఫీడర్‌కు ఉదయం ఎనిమిదినుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు లైన్ నిర్వహణ దృష్ట్యా సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు భగవద్గీత శ్లోకాల పోటీలు

పాతపట్నం, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి):స్థానిక షిర్డీగిరిపైగల షిర్డీసాయినాథుని ధ్యానమందిరంలో వసంతోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహక ప్రతినిధి తారకేశ్వరరావు తెలిపారు. ఆశక్తి గల అభ్యర్థులు పాల్గొనాలని కోరారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు

కొత్తూరు,ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : కొత్తూరు కేజీబీవీలో ఆరు నుంచి 12వ తరగతి వరకూ బాలికల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ కె.క్రాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రెగ్యులరైజేషన్‌కోసం..

నందిగాం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జీవో ఎంఎస్30 ప్రకారం అభ్యంతరం లేని పోరంపోగు భూముల్లో ఇళ్ల నిర్మాణం చేసుకొని ఉంటే రెగ్యులరైజేషన్‌కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పెద్దింటి సోమేశ్వరరావు ఒకప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకొని తమ కార్యాలయానికి దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

6 నుంచి శిక్షణ తరగతులు

పాతపట్నం ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని వైటీసీలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆరో తేదీనుంచి ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు అమ్మా చారిటబుల్‌ట్రస్ట్ రీజనల్ ఇన్‌చార్జి ఎం.చంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి కంప్యూటర్ బేసిక్స్, ఎంఎస్ ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఇంటర్వ్యూల నైపుణ్యత, సోలార్ పీవీ ఇన్‌స్టాలర్‌విభాగాల్లో నాలుగునెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

పలాస, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మకోనేరులో ఆక్రమణ తొలగించాలని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు దువ్వాడ జీవితేశ్వరరావు కోరారు. గురువారం కోనేరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి కోనేరును అభివృద్ధి చేయడానికి నెక్లెస్‌పార్కుగా రూపొందించారని, ప్రస్తుతం దాన్ని రక్షించేవారు లేకపోవడంతో ఆక్రమణలకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

క్షయ పరీక్షలు చేయించుకోవాలి

జలుమూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) క్షయ రోగుల కుటుంబ సభ్యులు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని నరసన్నపేట టీబీ యూనిట్ వైద్యాధికారి సుజాత తెలిపారు. గురువారం జలుమూరు పీహెచ్‌సీలో క్షయ రోగులతో కాంటాక్టులో ఉన్న వ్యక్తులను గుర్తించి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రసన్నలక్ష్మి, సీహెచ్‌వో పద్మావతి, చిన్నరాజులు పాల్గొన్నారు.

విద్యార్థుల నృత్య ప్రదర్శన

హరిపురం,ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మందస, హరిపురంలోని విద్యార్థులు ఉగాది పురస్కరించుకుని అన్నవరం సత్యనారాయణస్వామి సన్నిధి, రాజమహేంద్రవరం వెంకటేశ్వర కళాక్షేత్రంలో కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు.మందసలోని సాయిమెహర్ నృత్యకళాక్షేత్రంశిక్షకులు విద్యార్థులను అభినందించారు.

13న వాసుదేవరావు వర్ధంతి సభ

పలాసరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సీపీఐ న్యూడెమోక్రసీ నాయకుడు పైల వాసుదేవరావు 15వ వర్ధంతిని విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ శ్రీకాకుళం జిల్లా నాయకులు కోరారు. ఈనెల 13న జరిగే వర్ధంతి సభ పోస్టరును బుధవారంబొడ్డపాడులోని అమరవీరుల స్మారక మందిరంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్, తాండ్ర ప్రకాశ్, మాధవరావు, గొరకల బాలకృష్ణ, జుత్తు వీరాస్వామి, కుత్తుమ హేమ, స్వార రామారావుపాల్గొన్నారు.